మా పెద్దక్క బిడ్డ పెద్దదైంది. ఎల్లుండి చీరె కట్టిస్తున్నరు. తప్పక రావాలె' అని జెడ్పీటీసీ సభ్యురాలు ద్యావనపెల్లి కరుణ అడగడంతో సర్పంచు మ్యాకల లక్ష్మి సరేనంది. లక్ష్మికూ్కడా ఆ వూళ్ళో చిన్నపని ఉంది. ఆ పనేమిటో కరుణ చెవిలో వేస్తే ''ఆ పని నేను చూసుకుంట నీకెందుకు శ్రమ'' అని భరోసా ఇచ్చింది. ఆ రెండు పనుల కోసం వాళ్ళు కొంచెం పొద్దున్నే బయలుదేరారు.

చెలిమ

— బి.ఎస్. రాములు

ఊళ్ళోకి వెళ్ళే బస్సు ఎత్తిపోవడంతో రోడ్డుమీదే దిగి నడక ప్రారంభించారు. ఇరవై నిమిషాలు నడిస్తే ఊరు. జగిత్యాల టౌన్‌కు అరగంట దూరంలోనే ఉన్నా అది పూర్తిగా పల్లెటూరు. శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతం. రోడ్డు కాడికి ఎవరినైనా స్కూటరిచ్చి పంపుతా అని అక్కడ అన్నది గాని కరుణనే వద్దన్నది.

ఇంటికి చేరేసరికి వాకిట్లో టెంటు అప్పుడే వేస్తున్నారు. వంట మనుషులు వంట అపుడే మొదలుపెట్టినట్టున్నారు. 'శృతి'కి స్నానం చేయించి కొత్త పట్టులంగా జాకెట్ కట్టించి కూర్చోబెట్టారు. పేరంటం మొదలవడానికి ఎంతలేదన్నా ఇంకా రెండు గంటలు పడుతుంది. ఈలోపు ఊళ్ళోకి పోయి వద్దాం అని ఇంట్లో అందర్నీ పలకరించి లక్ష్మిని బయల్దేరదీసింది కరుణ.

ద్యావనపెల్లి కరుణ, మ్యాకల లక్ష్మిగారలది దగ్గరి దగ్గర ఊర్లు. వాళ్ళిద్దరి ఊర్ల నడుమ మరో ఊరుంది. ఆ ఊళ్ళోని జిల్లా పరిషత్ హైస్కూలులో లక్ష్మి ఏడవ తరగతిలో ఉన్నపుడు కరుణ పదవ తరగతి చదువుతోంది. మండల స్థాయి స్కూలు ఖోఖో పోటీల్లో జూనియర్స్ టీంలో లక్ష్మి. సీనియర్స్ టీంలో కరుణ ఎన్నికయ్యారు. అలా నాల్రోజులు కోచింగ్‌లో, పోటీల్లో కల్సి ఉన్నారు. అదే పరిచయం స్నేహంగా మారింది.

వీళ్ళు వెళ్ళేసరికి ఆ ఊరి బీసీ సర్పంచ్ గాజుల భూమయ్య ఇంటికాన్నే ఉన్నాడు. ఎవరో పంచాయతీ పరిష్కారం కోసం టైం ఎపుడిస్తారో అని అడగవచ్చిన వాళ్ళున్నారక్కడ.

''నమస్కారం'' అంటూ లేచి కరుణక్కకు నమస్కరించాడు సర్పంచ్ భూమయ్య. ''జెడ్పీటీసీ కరుణక్క'' అంటూ తన కోసం వచ్చిన వారికి పరిచయం చేశాడు. వాళ్ళు నమస్కరించారు. లక్ష్మిని భూమన్నకు పరిచయం చేసింది. పరస్పర నమస్కారాలు కుశల ప్రశ్నలు అయ్యాక అదీ ఇదీ అడిగి తెల్సుకుంది కరుణ. ఏ స్కీం ఎలా అమలుచేస్తున్నారో భూమయ్య చెప్తున్నాడు.

''మీ ఊర్లె లోనుకోసం ఎన్ని దరఖాస్తులచ్చినై. ఎంత సూరిటీ ఇచ్చినా బ్యాంకోల్లు పాతలోన్లు వసూలయ్యే దాకా కొత్త లోన్లు యియ్యమంటున్నరు వేరే మార్గం చూడాలె...''

''అందుకే దరఖాస్తులు ఎక్కువిస్తలేరు. ఓ మాలోల్ల పిల్లగాడు వడ్లగిర్ని (హల్లర్) కోసం లోన్ కావాలన్నాడు. ఓ సాకలోల్ల పిలగాడు కిరాణా షాపుకు లోన్ కావాలన్నడు. ఒక మాదిగోల్ల పిలగాడు సైకిల్ టెక్సీకి లోన్ కావాలన్నాడు. ఇంకో మాదిగోల్ల పిలగాడు ఆటోకోసం లోన్ దరఖాస్తు ఇచ్చిండు... వాల్లకు ఏం జెప్పన్నో తోస్తలేదు...''

''మనం జెడ్పి తరపున ఏదన్న చెయ్యాలె. వాల్లను పిలిపిస్తె వాల్లకు స్యూరిటీలు సాల్తయా... తీసుకున్నంక లోన్ కడ్తరా కట్టరా... కొంచెం సూడాలె'

''అట్లనే'' అని ఎవర్నో ఆ పనికి పురమాయించాడు భూమయ్య.

''మొన్న సర్పంచులకు మహిళా వార్డు మెంబర్లకు ఇచ్చిన ట్రేనింగ్ ఎంతో మంచిగుంది గ్రామీణ వికాసం, గ్రామపంచాయతీల నిర్వహణ మార్గదర్శిని అనే రెండు పుస్తకాలు ఎంత గొప్ప పుస్తకాలు'' అంది లక్ష్మి.

''వార్డు మెంబర్ ఆడోల్లకు కూడ అన్ని విప్పి చెప్పేసరికి మనం ఎక్కడ ఎట్ల తింటున్నమో అన్ని రహస్యాలు తెలియజెప్పినట్టాయె. అని గులిగే మన సర్పంచులు లేరా!'' అని నవ్వాడు భూమయ్య.

లక్ష్మి, కరుణ కూడా ఆ నవ్వుతో జత కలిపారు.

''ఆ ట్రేనింగ్ చేసిన్నించి ఇక ఎప్పుడు నా వెంట రావద్దు, పైరవీలు తేవద్దు. నేను చెప్పే వినది... మీరే కలసి చెప్పుకోన్రి అని అందరికి చెప్పుమని నీకే రిస్కు తగ్గుతదని మొన్న కరాకండిగ నవ్వుకుంటనే చెప్పిన మా ఆయనకు'' అని మళ్ళీ నవ్వింది కరుణ.

''నమస్తే సర్పంచ్ సాబ్'' అంటూ ఓ యువకుడు పలకరించడంతో ఆ చర్చ ఆగిపోయింది.

''మా ఊర్లె బాగ చదువుకున్న మాదిగోల్ల పిలగాడితడు. బొందలగడ్డ సుధాకర్. బి.ఈడి చేసిండుగని మొన్నటి డీఎస్సీల రాలేదు. ఆటో కోసం లోన్‌కు దరఖాస్తు పెట్టిండు. లోన్ వస్తే ఆటో తీస్కొడట. ఆ పైసల్తోని స్కూలు పెడ్తడట''

''మంచి ఆలోచనే గని బ్యాంకోల్లు ఒప్పుకుంటరో లేదో... అయితే సుధాకర్‌గారూ... మీరు స్కూలును ఈ ఊళ్ళో పెడ్తరా... మీ వాడకు పెడ్తరా...'' ఆరా తీసింది కరుణ.

''మా మాదిగవాడకు ఊరికి నడుమ ఒక ఎకరం రోడ్ సైడుకు కిరాయకు తీస్కొని రేకుల షెడ్డులు వేద్దామని... అట్లయితే అందరికి దగ్గర'' అన్నాడు సుధాకర్.

''టీచర్ ఉద్యోగం వస్తే ఎట్ల?'' అడిగింది లక్ష్మి.

''నేను మా వూరి దగ్గర ఊర్లకు పోస్టింగ్ వేయించుకుంట మా సర్పంచ్ సాబ్ లేదా చెప్పుటానికి. కష్టమైతే నా భార్య చూసుకుంటది''

''పైసా సంపాదన లేకుంట అప్పుడే పెళ్ళి చేసుకున్నారా?'' సుధాకర్ని నిండుగా చూస్తూ నవ్వుతూ అడిగింది లక్ష్మి.

'లేదక్కా... కాదు మేడం... నాకింకా పెళ్ళికాలేదు సర్పంచ్ సాబ్' ఎట్లా సంబోధించాలో కాస్త తడబడ్డాడు సుధాకర్. ఏమటంటే అక్కా అని పిలిచేంత వయసు లేదు లక్ష్మికి. మేడం అని పిలిచేంత సంస్కారవంతమైన స్త్రీలా లేదు. వేరే ఊరి సర్పంచ్‌ను సర్పంచ్‌సాబ్ అని సంబోధించడానికి తోచడం లేదు. అలా కాదనుకుని ఆమెను స్త్రీగా చూద్దామనుకుంటే కుదరదు. ఆమె అడిగే స్థాయిలో ఉండె. తాను చెప్పే స్థాయిలో ఉండె.

''సుధాకర్ నిలబడే మాట్లాడవద్దివి. కూర్చో'' అని బల్ల చూపించాడు భూమయ్య.

''అయితే నీ పెళ్ళికాకముందే పెళ్ళయినంక నీ భార్య ఏం పనిచేయాలో ముందే నిర్ణయించేశావన్నమాట... నీ భార్యకు స్కూలు నడపడం ఇష్టం లేదనుకో. నీలాగ ఉద్యోగమో, నాలాగ రాజకీయాలో చేయాలనుకుంటే అపుడెట్లా...'' నవ్వి అడిగింది కరుణ.

''ఎవరికి నడపడం వీలుకాకపోతే స్కూలు ఎవరికన్న అమ్మేస్త...''

''మీరు స్కూలు తప్పక నడుపుకుంటనంటే నాకు తెల్సిన ఫైనాన్సులో తక్కువ వడ్డీకి లోన్ ఇప్పిస్త. మీ ఇల్లూ అదీ ఓసారి చూద్దామా'' అంటూ లేచింది కరుణ.

''లచ్చువ్వా ఎవలన్న వస్తే హరిజనవాడకు రమ్మను'' అని భార్యకు చెప్పి సర్పంచు భూమయ్య సుధాకర్ వాళ్ళ ఇంటికేసి దారితీశాడు. ఊరూ మాదిగవాడా పెరుగుతూ కల్సిపోతున్నయి. వాడకూ ఊరుకూ నడుమ ఫర్లాంగు ఎడం మాత్రమే పొలాలు పెరండ్లుగా మిగిలాయి. వాటిలో కూడా అక్కడక్కడ ప్లాట్లు చేసి అమ్ముతున్నట్టు ఖనీలు (అయిడర్‌లు)న్నాయి.

సుదాకర్‌ది తాటాకుల గుడిసె. వాకిట్లో పందిరి కింద సుధాకర్ తల్లి ఈతాకుతో చీపుర్లు తయారుచేస్తోంది. తండ్రి ఈతనార చీరుతూ నీల్లతో నానపెడ్తున్నాడు. సాయంత్రానికి ఈతతాడు నేస్తాడు కావచ్చు.

''నమస్కారం అయ్యా!'' అని లక్ష్మి సుధాకర్ తల్లిదండ్రులకు ముందుగా నమస్కరించింది. భూమయ్య వాళ్ళను వారికి పరిచయం చేశాడు.

ఇంటి వెనక కొంచెం స్థలం ఉంది. ఓ నిమ్మ, ఓ జామ చెట్లున్నాయి.

''ఎంతమందున్నా నీకు పిల్లలు'' కరుణ అడిగింది.

''ఇద్దరు బిడ్డల వెనుక వీడు. వీవెనుక ఇంకోడు. వాడు ఈతపండ్లకని ఈదుల్ల పొంట వోయిండు'' అంది తల్లి.

''నీ కొడుకు స్కూలు పెడ్తనంటున్నడు. లోన్ కావాల్నట. ఈ ఇల్లు కుదవపెడ్తేనే ఇస్తరు. మీకిష్టమేనా...''

''ఏదో గా నౌకరి ఇప్పిస్తె మంచిగుండు. మాదిగోల్ల బడికి ఊరోల్లు పిలగాండ్లను పంపుతరో లేదో... ఈడేమో ఇస్కూలు పెడ్తపెడ్త అని అంటడు. మీరందరు గల్సి తల్సుకుంటే గీ ఒక్కనికి నౌకరి ఇప్పియ్యరాదా అవ్వా'' అంటూ చేతులు జోడించింది తల్లి. కాళ్ళు పట్టుకోబోతే కరుణ దూరం జరిగింది.

''ఉద్యోగాలంటే అంత అల్కక కాదమ్మా. మొన్నటి సెలక్షన్ల మండలాధ్యక్షురాలుగా వేములవాడ మొకాన పని చేస్తున్నామె కూడా సెలక్టు కాలే. మరి ఆమె చేతికింద ఇన్నూరు. ఇంటున్నవా ఇన్నూరు మంది పంతుల్లు ఇద్దరు డాక్టర్లు పదిమంది నర్సులు పని చేస్తున్నరు. ఆ మండలానికి ఆమె ఎమ్మెల్యే తర్వాత ఎమ్మెల్లే అంత మనిషి. నీ కొడుకు సదివినట్టె బిఈడి సదివింది. కని సెలక్టు గాకపాయె''

''ట్లంటరయ్య మరి బడి పెట్టుకొమ్మంటర? మావోడు బడి వెడ్తె ఎవలస్తరయ్యా...''

''గట్ల అనుకోవద్దమ్మా... ఇగో లక్ష్మి కూడా మాదిగోల్లే. సర్పంచుగ ఎన్నుకున్నరు. ఇంకా పెండ్లిగాలే. చిన్నప్పుడు పెండ్లయి కార్యం కాక ముందు ఇడుపు కాగితాల్లైనై. గీ చిన్నపిల్లకు నమస్తె పెట్టుడా అనుకున్నరు. కని యాడాది తిరగేటాల్లకు అందరు సర్పంచక్కా సర్పంచమ్మా అని పిలుస్తున్నరు. మాదిగిండ్లల్లకే పోయి లక్ష్మిని కలుస్తలేరా. ఇక్కడ భూమన్న తన ఇంటికాడ ఎట్లా పంచాయతులు చెప్తున్నడో గట్లనే తన ఇంటికాన్నే మాదిగల వాడలనే ఊరోల్ల పంచాయతులు చెప్తున్నది లక్ష్మి. అవసరం ఉన్నోల్లు కలుస్తలేరా. వస్తలేరా. ఏదైనా గంతే. కొంచెం అలవాటు గావాలె. అలవాటు అయ్యేదాక కొంచెం తిప్పలు. ఇంకా నాలుగేండ్లు వేములవాడ ఆమె మండలాధ్యక్షురాలుగ చేసినంక ఇప్పటోలే టీచర్ ఉద్యోగం కోసం తిరుగుతదా! పిలిచి ఇస్తనన్నా చెయ్యది. మల్ల మండలాధ్యక్షురాలుగనో, సర్పంచుగనో, చేస్తనంటదిగని టీచర్‌గ చెయ్యది. బడిల సదువు మంచిగచెప్తే ఏం కులం అని సూడరు. నీ కొడుకు బడిలకే పంపుతరు...'' అంటూ సముదాయించింది కరుణ.

అవీ ఇవీ మాట్లాడి అక్కన్నించి బయలుదేరారు. సుధాకర్‌ను తమ అక్క ఇంటికి భోజనానికి రమ్మని మరీ మరీ చెప్పింది కరుణ. భూమన్నను కూడా ఆహ్వానించి సెలవు తీసుకుంది కరుణ.

''పిలగాడు ఎట్లున్నడు... సర్పంచుగారికి నచ్చినట్టేనా!'' తోవలో నవ్వుతూ అడిగింది కరుణ.

''ఎంత చూసినా ఒక్కసారికే ఒక నిర్ణయానికి రాకూడదు అని మనకు ట్రేనింగ్‌లో సార్లు చెప్పలేదా! ఇంకా అన్ని విషయాలు తెల్సుకోవాలె...'' అని సర్పంచులా గంభీరంగా అంటూ నవ్వింది లక్ష్మి.

''ఈ కొత్తరకం పెండ్లి చూపులకు పిలగాడేమన్న బాధపడ్తడంటవా!'' మళ్ళీ తనే అంది లక్ష్మి.

''గట్ల బాధపడేటట్టు మనం ఏం చేసినం. అందర్తోని కలిసి మాట్లాడినం. అయినా బాధపడేత అలాంటి వాడు సర్పంచుకు భర్తగా పనికిరాడు. అసలు నన్నడిగితే పిల్లనే పిలగానింటికి పిలగాన్ని చూడపోవాలె. తన అత్తగారిల్లు, పరిసరాలు ఎట్లా ఉంటాయో ఆడపిల్లకే తెల్సుకోవడం అవసరం. ఎందుకంటే పిల్ల అత్తగారింట స్థిరపడ్తది కని పిలగాడు కాదు గద. అందుకని పిలగాని ఇంటికాన్నే పిల్లగాన్ని పెండ్లి పిల్ల తీరు కూసోపెట్టి పిల్ల పిల్ల తల్లిదండ్రులు సూసి మాట్లాడాలె' అంది కరుణ.

తోవలో కల్సిన వారితో మాట్లాడ్తూ పేరంటం ఇంటికి చేరేసరికి ఇల్లు పట్టుచీరెల్తో కళకళలాడుతోంది. ''నమస్కారం జెడ్పీటీసీ కరుణక్కా'' అంటూ ఎవరెవరో బంధుమిత్రుల పరామర్శలు, కౌగిలింతలు.

తనకు తెల్సిన వాళ్లందరికి సర్పంచు లక్ష్మక్క అంటూ పరిచయం చేసింది కరుణ. చెంపలకు పసుపు, నొసటబొట్టు పెడ్తూ వస్తున్నవారు వీళ్ళిద్దరికి మరికొంచెం ఎక్కువ దట్టించారు. కరుణ తాను అక్క కూతురు శృతి కోసం తెచ్చిన చీరను ఒడిలోపెట్టి చెంపలు నొక్కి అక్షింతలు వేసింది.

ఆడవాళ్ళు రాజకీయాలు - రాజకీయాల్లో ఆడవాళ్ళు గురించి ఎన్నో ముచ్చట్లు సాగాయి. మధ్యమధ్యలో వాళ్ళ అభిప్రాయాల్ని సరిచేస్తూ కరుణ, లక్ష్మి, తమ అనుభవాల్ని వాళ్ళతో కల్సి పంచుకున్నారు. కొంచెం చొరవ ఏర్పడ్డంతోనే లక్ష్మి కలుపుగోలుగా మారిపోయింది. చర్చ పట్టుచీరెల మీది కెళ్ళింది.

''మన ఆడోల్లను నగలకు, పట్టుచీరెలకు మురిసిపోయేట్లు చేసి మొగోల్లు అన్నివాల్లవిగా మార్చుకున్నరు. రెండువేల పట్టుచీరెనట ఇది. అంటే దీనికి నెలకు నలభై రూపాయలు వడ్డీ చొప్పున యాడాదికి అయిదు వందల వడ్డీ అయితది. నాల్గైదు పట్టుచీరెలంటె పది పదిహేను వేల రూపాయలు... అర ఎకరం పెరడు వస్తది. లేకపోతే ఓ లూనా, టీవీయస్ మోపెడ్ వస్తది. దాని మీద బట్టలు వేసుకొని మీరు కూడా బ్యారాలు చేసి రావచ్చు. మీరంత పద్మశాలీలు బట్టల బ్యారం అలవాటేనాయె. లేకపోతే ఈ పట్టుచీరెల పైసలతోని చిన్నగ ఓ కోళ్ళఫారమే పెట్టుకోవచ్చు. ఇంటికాడ కూసున్నకాడ నెలకు వెయ్యి రూపాయలు కోళ్ళ ఫారంల సంపాయించవచ్చు. అంతగనం కష్టపడి, బీడీలు చేసి సంపాయించిన పైసలు... పట్టుచీరెలు కొంటే ఎంత వృధా ఖర్చు... మనం ఈ నగల మోజు చీరెల మోజు వదిలించుకుంటె మన దగ్గర ఎన్ని పైసలు మిగులుతయో...''

లక్ష్మి మాటల మధ్యలోనే సుధాకర్, భూమన్న భోజనానికి వచ్చినట్టున్నారు.

''ఇగో మేం చెప్తే మొగోల్లు గట్లనే అంటరు అంటిరి. అందుకనే గౌర్మెంటు ఆడోల్లను కూడా నాయకులు గావాలె అని చెప్పింది. పట్టుచీరెలు, పండుగలు, పెండ్లిల్లు పెద్దఎత్తున చేసి ఉన్నకాడికి ఒడగట్టుకొని అప్పులకు చెయి సాపుడు మంచిది కాదని మన లక్ష్మక్క కరుణక్క చెప్తున్నది. ఇని ఇక నుంచెన్నా కొంచెం మారున్రి'' అన్నాడు భూమయ్య.

''ఔను. పాకిస్తాన్‌ల బురఖాలు వేసుకునే ఆడోల్లు కూడా మొగోల్లతోని సమానం అంటున్నరు. పెండ్లి పేరంటాలకు, ఖర్చులు చేసేది లేదని అక్కడ చట్టం తెచ్చిన్రు. మన దగ్గర కూడా అసొంటి చట్టం రావాలె. ఈ ఊర్లె అందరి పెండ్లిల్లు ఒకటే కాడ నెలకు ఓరోజు నిశ్చయం చేసి ఆ రోజున్నే జరుపాలె. మనిషికి యాభయి మంది సుట్టాలు పక్కాలు కన్నఎక్కోవద్దు. అందరు కలిస్తె ఊరంత పండుగ తీరుంటది. ఖర్చూ తగ్గుతది'' అంది కరుణ.

''చీరెలద్దు, పండుగల కర్సులద్దు. ఇట్ల అనుకుంటపోతె అన్నీవద్దని పిస్తయి.క దేనికీ బతుకుడు'' అంది ఓ ముత్తయిదువ. మంచిగ అడిగినవు అన్నట్లు చూశారు మిగతావాళ్ళు. సర్పంచు భూమన్న సుధాకర్‌ను లక్ష్మి గురించి ఏం చెప్పాడో, ఒకటికి రెండుసార్లు ఆమెను మళ్ళీ మళ్ళీచూసే ప్రయత్నం చేశాడు. కాని చుట్టూ ఆడవాళ్ళు... సిగ్గు. పైగా ఆడవాళ్ళు ఆమె కనపడకుండా ఏదో పనిమీద అటూ ఇటూ నడవడం. సరిగ్గా చూసినట్టనిపించలేదు సుధాకర్‌కు.

''సంపాయించేదే తక్కువ. దాన్ని వృధా ఖర్చుచేసి అప్పులు చేసుడెందుకు. పొదుపుతో ఎంతో పైకి రావచ్చు...'' అంటూ వివరంగా చెప్పింది కరుణ. తొమ్మిదో తరగతి పూర్తయి పట్టుచీర కట్టుకొని అపుడే పూచిన పూవులా నిగనిగలాడుతున్న శృతి కరుణ చిన్నమ్మ, సర్పంచ్ లక్ష్మక్క మాట్లాడేవన్నీ జాగ్రత్తగా వింటోంది. వాళ్ళిద్దరి వ్యక్తిత్వాలు రేపటి శృతి వ్యక్తిత్వంపై ఎంత గొప్ప ప్రభావం వేస్తాయో ఇపుడే ఎవరు చెప్పగలరు.

అందరూ భోంచేసి వెళ్ళాక కరుణ లక్ష్మి పక్కింట్లో స్థలం సంపాదించి నడుం వాల్చారు. చిన్నమ్మతో మాట్లాడాలని తీరిక చేసుకొని అక్కడికి శృతి చేరేసరికి వాళ్ళకు మగత నిద్రపట్టేసింది. కొద్దిసేపు ఎదురుచూసింది. వాళ్ళు లేచి ''ఎంతసేపైందే వచ్చి... లేపకపోయినవు'' అంటూ శృతిని పలకరించారు. ముఖం కడుక్కొని వచ్చి కూర్చున్నారు.

అవీ ఇవీ అడిగి విషయంలోకి వచ్చింది శృతి.

(మిగతా 14వ పేజీలో...)

చెలిమ (కథ)

(12వ పేజి తరువాయి...)

''చిన్నమ్మా. ఇన్ని చెప్తవు. ఈ చీరె కట్టిచ్చుడు ఇంట్లకూసోవెట్టుడు ఎందుకు బందు చేయించలేదే. ఇపుడు నాకు బజార్లకు పోవాలంటేనే సిగ్గనిపిస్తంది''

''సిగ్గుపడాల్ననే ఇవి పెట్టిరి... గడియారం పెట్టుకుంటె ఒక చేతికన్న గాజులేసుకునుడు తప్పుతదని ఈ పనిచేసిన. ఈ చెయికి ఒక రింగు బస్...'' అంటూ నవ్వింది లక్ష్మి.

''నీకు ఇంతకుముందు ముక్కుపుల్ల కూడా ఉన్నట్టుంది గద అక్కా...''

''ఔను. మీటింగుకు పోవుడు వచ్చుడు. బస్సులు ఎక్కుడు దిగుడు... ఓకెయి చీమిడి చీదుతె ముక్కుపుల్ల అడ్డంబడి ఇంకోకెయి చీమిడి పడు. అది కుచ్చుకపోవుడు. అన్ని తీసి పడేసిన. మరీ బోడబోడ ఉండద్దని గీ చెవి రింగులు పెట్టుకున్న'' అంది లక్ష్మి.

''చిన్నమ్మా మొగోల్లకు పండుగెందుకు జెయ్యరే - పెద్దోల్లయినట్టు...''

''మంచి ప్రశ్ననే. వెనుకట మొగోల్ల మీసాలు గడ్డాలు తీసుటానికి పండుగతీరు చేద్దురట. ఇపుడు పోయింది...''

చిన్నమ్మ జవాబు శృతి అనుమానాన్ని తీర్చలేకపోయిందని ఆ ముఖమే చెప్తోంది.

''అది కాదు చిన్నమ్మా... మొగోల్లు కూడా పెద్దమనిషైనట్టు వారం పదిరోజులు ఇంట్ల కూసోపెట్టి గిట్లనే భోజనాలు పెట్టించే పండుగ ఎందుకులేదు?''

''నువ్వు ఎమ్మెల్లే అయినంక అసెంబ్లీల వేయాల్సిన ప్రశ్న ఇపుడు నాకేస్తె ఎట్లనే...'' అంటూ నవ్వి శృతి తల నిమిరింది కరుణ.

''నిజంగనే శృతి ఎమ్మెల్లే అయితది. ఆ ప్రశ్న వేసే తీరు, ఆ మొఖంల కళ కనపడ్తనే ఉన్నయి'' అని శృతి చెంపల్ని ప్రేమగా గిచ్చింది లక్ష్మి.

శృతి సంతోషంతో మూడు వంకర్లు పోయింది. ఇలాంటి చిన్నచిన్న ప్రోత్సాహక మాటలే పిల్లల్లో గొప్ప శక్తిని కలిగిస్తాయని మహిళా సర్పంచ్‌ల ట్రేనింగ్‌ల సత్యమ్మ మేడం చెప్పింది వారికి బాగా గుర్తున్నట్టుంది.

సాయంత్రం కరుణ లక్ష్మి బయలుదేరారు. చెట్లు కనపడ్డంతో చాటుకు వెళ్ళారు. లక్ష్మికి అది వాగు అని - అక్కడ చెలమలు చెల్లారని అపుడే చూసింది.

''అబ్బ... పొద్దు వంగినా ధగడు తగ్గలే...'' అంటూ చెలిమ చల్లి ముఖం కాల్లు చేతులు కడుక్కుంది లక్ష్మి. కడుపు నిండా చల్లని నీళ్ళు తాగింది. కరుణ కొత్త చెలిమ తోడింది.

అదీ అంతే చల్లగా కొత్తగా ఉంది. వాళ్ళ జీవితాలలాగే ఆ చెలిమలు చూడ్డానికి బెత్తెడు లోతు లేవు. కాని చల్లిన కొద్ది కొత్తనీరు, చల్లిన కొద్దీ కొత్త ఆలోచనలు.

రోడ్డు మీద బస్టాపులో ప్రయాణీకులెవరూ లేరు. ఎవరో తాటిముంజల గెల తీసుకుపోతున్నారు.

''అబ్బ... తాజా ముంజలు. తిందామా అక్కా...'' లక్ష్మికి నోరూరింది. పెద్దగా గీచి గీచి బేరం చేయకుండానే చెరి మూడు ముంజకాయలు కొట్టించుకున్నారు. గీచి గీచి బేరం చేయడం హోదాకు భంగం అనే శిక్షణ పాఠం వారికి ఒంటపట్టినట్టుంది. ఎక్కువ బేరం చేయకపోవడంతో ఆ గౌడు మరో రెండు ముంజకాయలు ఉచితంగా కోసి ఇచ్చాడు. అతన్తో అదీ ఇదీ ఊరు విషయాలు అడిగి తెల్సుకున్నారు. బ్రేవ్‌మని తృప్తిదీరా తిన్నారు. చేతులు మూతులు కడుక్కోవడానికి నీళ్ళడిగితే గౌడు వాగుకేసి చూపాడు. బస్సు వస్తే కొంచెం ఆపు అంటూ వాళ్ళు రోడ్డు పక్కదాకా వచ్చిన వాగులోని చెలిమల్ని చల్లుకుని కడుక్కున్నారు. బస్సు రాలేదు. గౌడు పైసలు తీసుకొని వెళ్ళిపోయాడు.

''ఈ ఊరు ఎలా ఉంది. నీకు నచ్చిందా...'' రాజ్యం ఏలడం కోసం దత్తత ఇస్తున్న మహారాణి అడిగినట్టుగా ఉంది కరుణ ప్రశ్న. లేక లక్ష్మికే అలా అన్పించింది.

''అంతా మంచిగనే ఉంది కని...'' అంటూ ఆగిపోయింది లక్ష్మి.

''ఏంటిది. కానీ...''

''వచ్చే టర్మ్‌కు ఆ వూరి సర్పంచ్‌ను, అక్కడి జెడ్‌పిటీసీని, ఎంపిటీసీని ఆడోల్లకు రిజర్వు చేయించుతానంటే... సరే....''

''అబ్బ ఇపుడు నువ్వు నిజంగ రాజకీయ నాయకురాలివేనే'' అంటూ వొయ్యారంగా లక్ష్మిని తొడగిచ్చి నడుం గిచ్చి షేక్ హ్యాండు తీసుకుని చేయిని బిగ్గరగా నొక్కి పట్టింది కరుణ.

అపుడే బస్సొచ్చింది. గబగబా ఎక్కారు. వెనకనించి ఎవరో తమ పేర్లు పదవుల్ని చెప్పుకుంటూ ముచ్చటిస్తున్నారు. నిండు ఆత్మవిశ్వాసంతో వాళ్ళకు ప్రతి నమస్కారం చేసి సీట్లో కూర్చున్నారు వాళ్ళు.

☆

ప్రత్యేకతను చాటుకుంటోంది.

29, జూన్ ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ఎల్లోరా, ఎలిఫెంటా గుహల గురించిన 'ఇది కలలో కూడా ఊహించని కల' వ్యాసం, ఫొటోలు బాగున్నాయి. వ్యాస ప్రారంభంలో ఉదహరించిన పాట సందర్భోచితంగా ఉంది. ఫొటో ఫీచర్స్ ప్రచురించడంలో ఆంధ్రభూమి తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

స్పందనగారి 'తెలుగులో... చూస్తాం?' వ్యాసం బాగున్నా, అతిశయోక్తి పాలు ఎక్కువగా ఉందని నా అభిప్రాయం. నిజానికి కన్యాశుల్కం (గురజాడ), మరో మొహంజొదారో (ఎన్.ఆర్.నంది), నిజం (రావిశాస్త్రి) నాటకాలు ఇతర భాషల్లో వచ్చాయంటే నమ్మబుద్ధి కాదు. ముఖ్యంగా మన రాష్ట్రంలో నాటక సమీక్షకులు చాలామంది ఉన్నారు కానీ విమర్శకులు కొద్దిమందే. అందువల్ల వారు ఏది రాస్తే అదే ప్రామాణికం అని భావించవలసి వస్తోంది. వీరు ఇతర భాషల నాటకాల్ని విమర్శించినట్లు మన భాషా నాటకాల్ని తులనాత్మకంగా విమర్శించ లేకపోతున్నారు. 'కన్యాదాన్' గొప్పరచన అనడంలో సందేహం లేదు.

-మునుమూరి రామచంద్రమూర్తి (విజయవాడ)

అక్షరాలా నిజం

జూన్ 29, ఆదివారం అనుబంధం 'ఉన్నమాట'లో నెత్తికెక్కిన నౌకర్లు అంటూ నేటి రాజకీయ నాయకుల గురించి ఉన్నది ఉన్నట్లు చక్కగా వివరించారు. రాజకీయ నాయకులు ప్రజల ధనంతో విదేశాలకు వెళ్ళి ఖరీదయిన వైద్యం చేయించుకుంటున్నారు అన్నది అక్షరాలా నిజం. సరైన వైద్యంలేక ఆహారం లేక, రవాణా సౌకర్యాలు సరిగా లేక మారుమూల పల్లెల్లో ప్రజలు చీకటిలోనే మగ్గుతున్నారు. సొంత గూటికి హాంకాంగ్ కవర్‌స్టోరీ ద్వారా హాంకాంగ్ గురించి సరికొత్త విషయాలు తెలుసుకున్నాం. తూర్పు పడమర కలిసేచోటు అన్నది అద్భుతంగా ఉంది. నెత్తురొలికిన కల చదివి చలించిపోయాం.

-పి.పద్మావతి (రాయపల్లి)

కవర్‌స్టోరీ

జూన్ 8, ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీ 'క్రికెట్ మోజులో క్రీడా రంగానికి బూజు' వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించింది. అటు సంస్థలు, ఇటు ప్రభుత్వం, క్రీడాకారులు, క్రీడాభిమానులు కేవలం క్రికెట్‌పైనే దృష్టి పెట్టక అన్నిరకాల ఆటలపై ప్రోత్సాహాన్ని ప్రదర్శిస్తే మన దేశం కూడా ఒలింపిక్స్ లాంటి వాటిల్లో పతకాలు సాధించి దేశ పరువు నిలబడుతుందన్నది వాస్తవం.

-గుంటోజు సత్యం (పోచంపల్లి)

మంచి వ్యాసం

జూన్ 8, ఆదివారం అనుబంధంలో 'క్రికెట్ మోజులో క్రీడారంగానికి బూజు' చాలా బాగుంది. క్రికెట్‌తోపాటు వేరే క్రీడలను కూడా ప్రోత్సహించవలసిన అవసరం ఎంతైనా ఉందని చక్కగా తెలియజేశారు. మంచి వ్యాసాన్ని అందించినందుకు ధన్యవాదాలు.

-షేక్ అస్లాం షరీఫ్ (శాంతిపూర్)

'భావన'

ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'భావన' కవితలు వారం వారం మంచి పరిమళాల్ని వెదజల్లుతున్నాయి. అలాగే ప్రతి వ్యాసం మా ఇంటిల్లిపాదినీ ఆకట్టుకుంటోంది. ఫొటో ఫీచర్స్, కలర్ ఫొటోలు మమ్మల్ని ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం అనుబంధాన్ని ఇంత చక్కగా తీర్చిదిద్దుతున్నందుకు ధన్యవాదాలు.

-కొప్పర్తి రామారావు (మొగల్తూరు)



ఆ పనిపిల్ల ఇవాళ నెంబర్‌వన్ మోడల్

ఆమె క్రింది స్థాయి మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది. ఇళ్ళు ఊడ్చగా వచ్చిన సంపాదనతో చదివింది. అయితేనేం ప్రస్తుతం ప్రపంచ మోడలింగ్ రంగాన్నే శాసిస్తున్న సూపర్ మోడల్‌గా విరాజిల్లుతోంది. అత్యధిక పారితోషికం తీసుకునే నెంబర్ వన్ మోడల్. ఆమే సిండీ క్రాఫర్డ్. 1983లో అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రానికి చెందిన డెకాబ్ అనే పట్టణం నుంచి నిరుపేద కుటుంబానికి చెందిన పదిహేడేళ్ళ పిల్ల మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. సరిగ్గా పదేళ్ళు గడిచేటప్పటికి ప్రపంచంలోనే అత్యంత ధనికురాలైన మోడల్ గర్ల్‌గా స్థిరపడింది. ఇది ముమ్మాటికీ నిజం. సిండీ అంటే ఇప్పుడు ఓ వ్యక్తి కాదు. 'సంథింగ్'. సిండీ ఆదాయం సంవత్సరానికి రెండు మిలియన్ల డాలర్ల పైచిలుకే. ఆవిడ ఈ ర్యాంక్‌ను గత నాలుగేళ్ళుగా కాపాడుకుంటూనే వస్తోంది. రెవ్‌లాన్ లాంటి ప్రపంచ నెంబర్ వన్ కంపెనీకి సిండీని తప్ప వేరెవ్వరినీ కాంట్రాక్ట్ తీసుకోరు. పెప్సీకి ఆమె అంతర్జాతీయ కాంపైన్‌కి మోడల్. అమెరికన్ ఎంటివిలో కొంతకాలంపాటు యాంకర్‌గా వ్యవహరించింది. 1994లో విడుదలైన 'ఫిట్‌నెస్' ఇప్పటికీ రికార్డు స్థాయిలో అమ్ముడవుతోంది. దీన్నిబట్టే చెప్పేయవచ్చు 'సిండీ' గొప్పతనం. ఆమె చక్కని పొడగరి. కోమలమైన మేలిఛాయ. మంచి మేధాసంపత్తి. అసలైన అందాన్ని తెచ్చే ఆత్మవిశ్వాసం వెరసి 'సిండీ'.

సిండీకి బాల్యంలో తిండి, బట్ట తప్ప మిగిలినవన్నీ అందని పళ్ళే. స్కూలు చదువు పూర్తవగానే పదిళ్ళలో పనిమనిషిగా చేరింది. ఆ వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. తండ్రి ఎలక్ట్రీషియన్. తాగుబోతు. అయినా ఇంజనీరింగ్ చదివించాలనుకునేవాడు. కానీ స్తోమత అందుకు సరిపడలేదు. అయితే సిండీ మోడలింగ్ రంగంలో అడుగుపెట్టాక కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసి తండ్రి ఆశను తీర్చింది. అయితే సిండీ కోరిక కోరికగానే మిగిలిపోయింది. ఆమెకు చిన్నప్పటి నుంచి డాక్టరవ్వాలనే కోరిక ఉండేది. కానీ పేదరికాన్ని శాసించేందుకు తప్పని పరిస్థితుల్లో మోడలింగ్ రంగాన్ని ఎంచుకుంది.

ఝామ్మంటూ మోడలింగ్ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించలేదు. మొదట ఆమెకు నిరాశే మిగిలింది. ఎందుకంటే సిండీ పై పెదవి ఎడమవైపున ఓ పుట్టుమచ్చ ఉంది. దాని కారణంగా అనేక మోడల్ ఏజెన్సీలు 'లాభం లేదు. వెళ్ళవమ్మా' అంటూ తిరస్కరించాయి. అయితే 1983లో మాత్రం 'ఎలైట్ మోడల్ ఏజెన్సీ' ధైర్యంచేసి ప్రయోగాత్మకంగా చిన్నచిన్న కాంట్రాక్టులు చేసింది. అయితే సిండీకి సంతృప్తి దొరకలేదు. దాంతో 1986లో న్యూయార్క్ నగరంలోకి అడుగుపెట్టింది. జీవితం గురించి ఆలోచిస్తూ బీచ్ ఒడ్డున ఎన్నో రోజులు పిచ్చిగా తిరిగింది. అక్కడే ఆమెకో ఫొటోగ్రాఫర్ తారసపడ్డాడు. ఏదైతే సిండీకి మైనస్ పాయింట్ అయిందో దాన్నే ప్లస్ పాయింట్‌గా మార్చాడు. ప్రతి స్టిల్‌కు కొంచెం పెదవులను తెరవమని చెప్పాడు. అంతే సిండీ ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరమే రాలేదు. ప్రపంచ అగ్రశ్రేణి ఫ్యాషన్ మేగజైన్ 'వోగ్'లో పదహారుసార్లు కవర్‌పేజీపై దర్శనమిచ్చి సంచలనం సృష్టించింది. ఇతర రంగాల్లో అడుగుపెట్టేందుకుగాను మోడలింగ్‌ను వేదికగా వినియోగించుకోవాలని అనుకుంది. కానీ కుదరలేదు. తీరిక సమయాల్లో పుస్తకాలు చదవడం ఆమె హాబీ. అందుకే ఆమెకు దగ్గరగా పరిచయమైన వాళ్ళంతా పుస్తకాల పురుగు అని ముద్దుగా పిలుచుకుంటారు కూడా. 'బ్లెవరీ హిల్స్ కాప్-2' సినిమాలో సిల్వెస్టర్ మాజీ భార్య బ్రిగెటీ

> నిరుపేద కుటుంబానికి చెందిన పదిహేడేళ్ళ పిల్ల మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. సరిగ్గా పదేళ్ళు గడిచేటప్పటికి ప్రపంచంలోనే అత్యంత ధనికురాలైన మోడల్ గర్ల్‌గా స్థిరపడింది. ఇది ముమ్మాటికీ నిజం. సిండీ అంటే ఇప్పుడు ఓ వ్యక్తి కాదు. 'సంథింగ్'. సిండీ ఆదాయం సంవత్సరానికి రెండు మిలియన్ల డాలర్ల పైచిలుకే. ఆవిడ ఈ ర్యాంక్‌ను గత నాలుగేళ్ళుగా కాపాడుకుంటూనే వస్తోంది. రెవ్‌లాన్ లాంటి ప్రపంచ నెంబర్ వన్ కంపెనీకి సిండీని తప్ప వేరెవ్వరినీ కాంట్రాక్ట్ తీసుకోరు. పెప్సీకి ఆమె అంతర్జాతీయ కాంపైన్‌కి మోడల్.

నీల్సన్ ధరించిన పాత్ర కోసం మొదట సిండీనే సెలక్ట్ చేశారు. అయితే అందులో సెక్స్ పాళ్ళు మరీ అతిగా ఉందని సిండీ తిరస్కరించింది.

ప్రపంచంలో సిండీ తర్వాత నవోమి కాంపెబెల్, లిండా ఎవాంజిలిస్టా, క్రిస్టీ టర్లింగ్‌టన్, యాస్మిన్ ఆ స్థానంలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సిండీ తప్ప ప్లేబోయ్ పత్రికకు న్యూడ్ ఫోజులిచ్చే ధైర్యం వీళ్ళెవరూ చేయలేదు. ప్లేబోయ్ సిండీ ఫొటోలను హవాయి దీవుల్లో ఆమె పర్సనల్ ఫొటోగ్రాఫర్ హెర్బ్‌రిట్స్‌తో తీయించి 1988లో ప్రచురించింది. కేవలం మూడు ఫొటోలకు 40 వేల డాలర్లు తీసుకుందట. అయితే అప్పుడు అవకాశాలు లేక అవకాశాల కోసం ఇవ్వాల్సి [illegible] ఆ తర్వాత సిండీ ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. అయితే [illegible] లేదని పేర్కొంది. సిండీకి డబ్బు సంపాదనే కాదు, సామాజిక సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆసక్తి ఎక్కువ. తమ్ముడు మూడేళ్ళ ప్రాయంలో ల్యూకేమియాతో మరణించాడు. తమ్ముని చావు ఆమెను తీవ్రంగా కలచివేసింది. దాంతో ప్రత్యేకంగా 'పినప్' క్యాలెండర్‌ను తయారుచేయించి విడుదల చేసింది. దానిపై వచ్చే ఆదాయంలో ముప్పాతిక భాగాన్ని ల్యూకేమియాపై జరిగే పరిశోధనల నిమిత్తం అందించింది.

సిండీ భర్త రిచర్డ్ గెరె బౌద్ధమతాన్ని స్వీకరించి అంకితమై పోయాడు. అప్పుడప్పుడు బౌద్ధమత గ్రంథాలను కూడా సిండీ చేత చదివిస్తున్నాడట. వివాహ వ్యవస్థపై సిండీకి మంచి గౌరవముంది. చాలామంది కేవలం ప్రపంచవ్యాప్తంగా ఇమేజ్ ఉన్న జంట అనిపించుకోవాలని, ఆ స్టేటస్ కోసమే పెళ్ళి చేసుకున్నామని చెబుతుంటారు. నిజానికి 'గెరే' సూపర్‌స్టారని నేను పెళ్ళి చేసుకోలేదు. ఆ మాటకొస్తే నేనూ సూపర్ మోడల్‌నే. మేమిద్దరం ప్రేమించుకున్నాం, ప్రేమించుకుంటున్నాం, ప్రేమించుకుంటాం అంటూ తన వివాహం గురించి చెప్పింది.

సిండీని దగ్గరగా చూసిన వారంతా అమ్మో చాలా 'పవర్‌ఫుల్ లేడీ' అంటారు. మీరు నమ్మండి నమ్మకపోండి. నేనెప్పుడూ అభద్రతా భావంతో పడి భయపడుతుంటాను. రిచర్డ్ చాలా సౌమ్యుడైనప్పటికీ ఇందువల్లే మొదట్లో అడ్జస్ట్ కాలేకపోయాను. అయితే ఆ తరువాత కొద్దిరోజులకే అతడే నా సర్వశక్తి అనిపించేలా నన్ను మలచుకున్నాడని 'గెరే' గురించి గర్వంగా చెబుతోంది.

జీవితాన్ని ప్రేమించడం, అనుభవించడం సిండీ దగ్గరే నేర్చుకున్నానని గెరే చెబుతుంటాడు. వేకువ ఝామునే లేవడం, కాస్త వ్యాయామం చేయడం, స్నానం, టిఫిన్ ముగించి మేకప్ చేసుకోవడం, విమానం ఎక్కడం, నిద్రపోవడం, కాసేపు చదవడం, దిగి కారెక్కడం, మోడలింగ్ చేయడం, హోటల్‌కు వెళ్ళడం, కాసేపు టి.వి. చూడటం, తినడం, నిద్రపోవడం, ఇదంతా డాంబికమైన ప్రపంచం అనే స్పృహ ఆమెను అడుగడుగునా వెన్నాడుతూనే ఉంటోంది. ఎందుకంటే కిందిస్థాయి నుంచి వచ్చింది. అందుకే ఆమెను ఆమె సంపూర్తిగా నియంత్రించుకోగలదు. నిజానికి మోడలింగ్ ప్రపంచంలో సిండీకి ఆకాశమే హద్దు.

విచిత్రమేమిటంటే ఇంతటి స్థాయి, ఇంతటి లగ్జరీ ఇచ్చిన మోడలింగ్ పట్ల సిండీకి గౌరవం లేదు. ప్రేమ అంతకన్నా లేదు. ఇది వృత్తి అని అనుకోను. అనలేను. అయితే బాగా డబ్బు సంపాదించవచ్చని మాత్రం చెప్పగలనని మోడలింగ్ గురించి రెండు ముక్కల్లో చెప్పేసింది. అబ్బ! మోడలింగ్ బోర్ కొట్టేస్తుంది. ఇరవై నాలుగ్గంటలూ మేకప్‌తో మనోహరంగా కనిపించడం ఆషామాషీ కాదని చెబుతోంది. ఎందుకంటే బరువు పెరగకుండా చూసుకోవాలి. కోరుకునేది తినలేం, అప్పుడప్పుడు పస్తులుండాలి. రోజూ రెండుగంటలపాటు వ్యాయామం చేయాలి. ఈ రిస్కంతా ఇంకెంతో కాలం భరించలేను అని స్పష్టంగా బాధను ఏకరవు పెడుతోంది.

అయితే మిలియన్ల కొద్దీ డబ్బు వస్తుంది కాబట్టి ఎన్ని మాటలైనా చెబుతుందిలేనని అనుకోకండి. ఎవరికైనా నెంబర్ వన్ స్థానానికి చేరుకోవాలనే ఆశ ఉంటుంది. అయితే అక్కడికి చేరుకున్నాక ఛ! ఇంతేనా అనిపిస్తుంది. అంతే మరి.

-షర్వా